# పెంపకం


కామరాజుకిప్పుడు పెద్ద చిక్కొచ్చి పడింది.

సాయంకాలం ఆఫీసునించి తిన్నగా ఇంటికెళ్ళి బుద్ధిగా శ్రీమతి ఇచ్చే టీ తాగి, రిలాక్స్ అయ్యే అతనికి వారం రోజుల్నుంచి ఇంటికి వెళ్ళాలంటేనే భయంగా ఉంది.

గుమ్మంలోనే నిలబడి "డాడీ! కుక్కపిల్లని తెచ్చావా?" అని అడుగుతాడు అతని ఆరేళ్ళ కొడుకు బదరి.

వాడికేదో నచ్చచెప్పి లోపలికెళితే "ఏమండీ! ఊరి బయట కాలనీలో ఉంటున్నాం. అదీ గాక కొత్తగా ఇల్లు కట్టుకున్నాం. తోడుగా ఒక కుక్క ఉంటే మనకీ ధైర్యంగా ఉంటుంది... దొంగల భయమూ ఉండదండీ!" అని పోరు పెడుతుంది అతని భార్య జయంతి.

అక్కడితో ఆగితే బావుండు. ఊహూ...



ఆరోజు కాలనీ అంతా తిరిగి తాను సేకరించిన శునక సమాచారమంతా ఏకరువు పెడుతుంది జయంతి.

రోజూ అటు కొడుక్కీ ఇటు భార్యకీ సంజాయిషీ ఇచ్చుకోవడం కామరాజుకి కష్టంగానూ ఇబ్బందిగానూ ఉంది. అందుకే ఇవాళ ఎలాగైనా సరే కుక్కపిల్లని తీసుకునే యింటికి వెళ్ళాలనుకున్నాడు కామరాజు.

కామరాజు బడ్జెట్‌కి జాతికుక్క సరిపడదు.

అందుకే నాటుకుక్కనే ఎన్నుకున్నాడు.

రెండ్రోజుల క్రితం ఆఫీసు వాచ్‌మేన్ చెప్పిన విషయం గుర్తొచ్చి కామరాజు సరాసరి వాళ్ళింటికే వెళ్ళాడు. తనకో కుక్కపిల్ల కావాలని వాచ్‌మేన్‌కి చెప్పాడు.

"అలాగే సార్!" అంటూ వాచ్‌మేన్ ఇంటి వెనక్కి వెళ్ళి, రెండు కుక్కపిల్లల్ని తెచ్చి చూపించాడు.

"సార్! ఇవి పుట్టి వారం రోజులే అయింది. పెంపుడు జంతువుకి తిండి కంటే కూడా ప్రేమ ముఖ్యం. మీరెంత ప్రేమ చూపిస్తే అదంత విశ్వాసం చూపిస్తుంది. లేకపోతేనా...? కసితో కరిచేస్తుంది. గుర్తుంచుకోండి" అని జాగ్రత్తలు చెప్పాడు వాచ్‌మేన్.

రెండు కుక్క పిల్లలూ నల్లగా, బొద్దుగా ఉన్నాయి.

వాటిల్లో ఒకదాన్ని సెలెక్ట్ చేసుకుని ఇంటికి తెచ్చాడు కామరాజు.

తండ్రి చేతిలో కుక్కపిల్లని చూసి పరిగెత్తుకొచ్చిన బదరి "ఇదేంటి డాడీ? పమేరియన్‌ని తెమ్మంటే దీన్ని తెచ్చావు? ఛీ!... ఛీ!... మురుగ్గుంటలో పొర్లి వచ్చినట్టుంది. నాకస్సలు నచ్చలా" మొహమాటం లేకుండా చెప్పేసాడు.

"బద్రీ! బాగా డబ్బున్నవాళ్ళు ఏదో సరదా కోసం పమేరియన్‌ని పెంచుకుంటార్రా. కాపలా కాయటానికి అది పనికిరాదు. దానికే మనం కాపలా కాయాలి. అందుకే దీన్ని తెచ్చాను" అని కామరాజు కొడుక్కి నచ్చజెపుతూండగానే జయంతి వచ్చింది.

"ఇదెక్కడ దొరికిందండీ! సింగరేణి బొగ్గల్లే ఉంది" అని చీదరించుకుంది.

"నల్ల బంగారం! అలా ఉంటేనే దొంగలు భయపడతారు జయా!"

"దొంగల సంగతేమో కానీ నేను భయపడి చస్తున్నా" అంది జయంతి.

"అవునూ... దీనికేం పేరు పెడదాం? నువ్వు చెప్పరా బద్రీ" అడిగాడు కామరాజు.



డి. శ్రీనివాసదీక్షితులు

"హూ... దీనికో పేరు కూడా" మొహం తిప్పేసుకున్నాడు బదరి.

"మీ పేరు పెట్టండి... సరిగ్గా సరిపోతుంది!" ఎకసక్కెంగా అంది జయంతి.

"భైరవ్ అని పెడదాం. మన మాతృభాషకి సేవ చేసినట్టవుతుంది, వెరైటీగానూ ఉంటుంది" ఏకపక్షంగా తీర్మానించేసాడు కామరాజు.

బదరి స్కూలు నుంచి రాగానే భైరవ్ ముందు కూర్చుని దాన్ని వూరిస్తూ "ఏయ్ సింగరేణీ! నీకు ఈ బిస్కెట్ తుంపు కూడా పెట్టను. నేను తింటూంటే నా నోటి వంక చూస్తూ కూర్చో" అంటూ బిస్కెట్స్ తింటూంటాడు.

భైరవ్ చూస్తూ మొరుగుతుంది.

"ఎందుకు మొరుగుతావ్!" అంటూ చీపురు పుల్లల్తో చురుక్కుమనేలా కొడుతూ... బాధతో అది అరుస్తూంటే చూసి ఆనందిస్తాడు బదరి.

గొలుసు విప్పినప్పుడు భైరవ్ బదరి వెంట పడుతుంది. బదరి భయంతో ఇల్లంతా పరిగెత్తుతూంటే మరింతగా ఉత్సాహంతో అరుస్తూ వాడిని తరుముతూ తన కసిని తీర్చుకుంటుంది భైరవ్.

జయంతికి మూడ్ సరిగా ఉంటే "నాన్నా భైరూ! చిట్టి పప్పులూ! చిన్ని పప్పులూ! కమాన్... కమాన్..." అంటూ దాంతో ఆటలాడుతుంది.

మూడ్ లేకపోతేనా...? "ముదనష్టపుదానా! ఇటు చావవే. నాకో శనిలా దాపురించావు. నీ తోలు తీస్తా అరిచావంటే... నోర్ముయ్" అని చీదరించుకుంటుంది.

భైరవ్‌కి వారానికోసారి ఆదివారం నాడు కామరాజు హైపర్ సోపుతో స్నానం చేయిస్తాడు. తినటానికి పిడిగ్రీ బిస్కెట్లు పెడతాడు.

అందుకే కామరాజుని చూడగానే భైరవ్ విశ్వాసంతో తోక వూపుకుంటూ వంకర్లు తిరుగుతూ పరుగు పరుగున వెళ్ళి రెండు కాళ్ళ మీద నిలబడి పైకి ఎగబాకుతుంది. ఒళ్ళంతా నాకుతుంది.

అది అలా చేస్తూంటే కామరాజుకి చచ్చేంత భయం. అందుకని భైరవ్ దగ్గరకొస్తూంటే గావు కేకలు పెడుతూ తన గదిలోకి పరిగెత్తి, తలుపు లేసుకుంటాడు.

ఆఫీసు నుంచి ఇంటికొస్తూనే గేటు బయటే నిలబడి "జయా! ముందు భైరూని కట్టెయ్! ఊ... కట్టేసావా?" అని అడిగి మరీ లోపలికి అడుగుపెడతాడు కామరాజు.

భైరవ్‌కి విశ్వాసం కూడా ఎక్కువే. సహజంగా కుక్కలు కొత్తవాళ్ళని చూస్తే అరుస్తాయి... కరుస్తాయి కూడా! కానీ భైరవ్‌కి పాతా – కొత్తా తేడా తెలియదు. ఎవరేది పెట్టినా తింటుంది. అందరి మీదా విశ్వాసం చూపిస్తుంది. అందరినీ చూసీ అరుస్తుంది. కొత్త వాళ్ళతో పాటు ఇంట్లో వాళ్ళని, రోజూ ఇంటికొచ్చే పనిమనిషిని, లాండ్రీ అబ్బాయిని, పేపర్ బాయ్‌ని, పాలు పోసే కోటయ్యని, కొలీగ్ బ్రహ్మయ్యనీ చూసినా అరుస్తుంది. అంతెందుకూ... కామరాజుని చూసినా అరుస్తుంది.

దొరకీ... దొంగకీ తేడా తెలియని చిత్రమైన నాటుకుక్క భైరవ్.

రోజు రోజుకీ దాని లీలలు చిత్రాతిచిత్రంగా తయారవుతున్నాయి.

జయంతి వంట చేస్తూంటే చడీ చప్పుడూ లేకుండా వెళ్ళి ఆమె చీరలో దూరి రెండు కాళ్ళ మధ్య నక్కి కూర్చుని నాకుతుంది. జయంతి

బెదిరిపోయి, పక్కకి ఒక్క గెంతు గెంతి, చీపురు కట్ట తిరగేసి చావబాదుతుంది భైరవ్‌ని.

ఇక లాభం లేదని పగలంతా భైరవ్‌ని గొలుసుతో కట్టేసి ఉంచుతోంది జయంతి.

కట్టేస్తే పెంపుడు కుక్కలకి ఇష్టముండదు. జాతి కుక్కలయితే సహిస్తాయి కానీ నాటు కుక్కలు సహించవు. అందుకే ఎప్పుడూ మొరుగుతూనే ఉంటుంది అది.

అయితే... కామరాజు ఇంటి తిండి వంటబట్టి భైరవ్ బాగా బలిసింది. వాళ్ళు తినే సమస్తం అదీ తింటుంది వాళ్ళు పెట్టాలే గాని.

ఆర్నెల్ల తర్వాత లెక్కచూసుకుంటే కామరాజు గుండె గుభేలుమంది. బదరీ కంటే తిండి కింద భైరవ్‌కే ఎక్కువ ఖర్చయింది. దాంతో భైరవ్‌ని ఎలా వదిలించుకోవాలా అనే ఆలోచనలో పడ్డాడు కామరాజు.

క్రమంగా కుటుంబసభ్యులు ముగ్గురూ ఏకమయ్యారు.

అప్పట్నుంచి భైరవ్‌కి ప్రేమా, తిండీ అన్నీ కరువయ్యాయి. చీదరింపులూ, ఛీత్కారాలూ ఎక్కువయ్యాయి.

ఎప్పుడో నెలకోసారి భైరవ్ మీద బకెట్ నీళ్ళు కుమ్మరిస్తారు. అదే దాని స్నానం. సోపుతో రుద్దటం... టవల్‌తో తుడవటం ఏమీలేవు. గాలికి ఆరాల్సిందే దాని వళ్ళు. తినటానికి బిస్కెట్లు పెట్టడం లేదు. రాత్రిపూట మాత్రం దాని బొచ్చులో గుప్పెడు మెతుకులు వేసి, కాస్త గంజి పోస్తారు. అదే దాని తిండి.

ఆకలికి తట్టుకోలేక రాత్రిళ్ళు బిగ్గరగా మొరుగుతూ ఏడుస్తూంటుంది. దాని బాధ పట్టించుకునేదెవరు?

భైరవ్ క్రమంగా చిక్కిపోయింది.

ఎముకల పోగులా తయారయింది. ఇప్పుడది మొరగటం కూడా మానేసింది ఓపిక లేక. కోపం కూడా పెరిగింది. చూపుల్లో క్రౌర్యం వచ్చి చేరింది. పగలంతా కట్టేసి, రాత్రిపూట మాత్రం విడిచిపెడుతున్నారు. ఎప్పుడు ఆ ఇంట్లోంచి పారిపోదామా అన్నంత ఊపులో ఉంటోంది ఆ మూగజీవి.

ఒకరోజు తెల్లారేసరికి భైరవ్ భీభత్సం సృష్టించేసింది.

కామరాజు స్కూటర్ కవర్లని కొరికి చింపేసింది. చెప్పుల్ని కొరికి ముక్కలు ముక్కలు చేసింది. చీపుర్ని చిందర వందర చేసింది.

పొద్దున్నే పాలవాడి కేక విని పాలు పోయించుకోవటానికి తలుపు తీసిన జయంతి భైరవ్ చేసిన పనుల్ని చూసి నిశ్చేష్టురాలయింది.

ఇంతలో భైరవ్ హఠాత్తుగా జయంతి మీదకి ఎగబడింది. ఆమె చేతుల్లోంచి పాలగిన్నె జారి కింద పడిపోయింది. తనమీదకొచ్చిన భైరవ్‌ని దూరంగా నెట్టేసి గభాల్న తలుపేసేసింది. ఇంట్లోకొచ్చి కామరాజుని లేపింది. కామరాజుకి భైరవంటే చచ్చేంత భయం కదా! అందుకే అడుగు ముందుకు వెయ్యలేదు.

పెంపుడు కుక్క ఇలా చేస్తోందేంటా అని పాలవాడు నోరు వెళ్ళబెట్టి చూస్తున్నాడు గేటు బయటే నిలబడి. భైరవ్ ఒక్క ఉదుటున మెరుపు వేగంతో ఎగిరి గోడమీదుగా దూకి రోడ్డు మీద పడి భయంకరంగా అరుస్తూ ఎటో పారిపోయింది.

భైరవ్ మీకు ఎక్కడైనా కనిపిస్తే... దాన్ని మీరు గుర్తుపడితే... దాని గురించి కామరాజుకి మాత్రం చెప్పకండేం...! ●